క్లుప్తంగా

'ఎస్ఎంసీ' ఎన్నికల షెడ్యూల్ విడుదల

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల ఎంపిక కోసం ప్రభుత్వం, విద్యాశాఖ ఎన్నికల షెడ్యూల్‌ని విడుదల చేసిందని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1వ తేదీన ఎన్నికలకు సంబంధించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉదయం నోటిఫికేషన్ విడుదల చేస్తారన్నారు. మధ్యాహ్నం ఓటర్ల వివరాలను నోటీస్ బోర్డులో ఉంచుతారు. ఈనెల 8వ తేదీన ఉదయం ఎన్నికల నిర్వహిస్తారన్నారు.

పీహెచ్‌సీ డాక్టర్, ఫార్మాసిస్ట్ బదిలీ

వేటపాలెం: స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ బాలరాజు, ఫార్మాసిస్ట్ వెంకట ప్రసాదరావు ఇద్దరిని బదిలీ చేస్తూ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్ విజయమ్మ ఉత్తర్వులు జారీచేశారు. డాక్టర్ బాలరాజును అద్దంకి మండలం మాదేపల్లికి, ఫార్మాసిస్ట్ వెంకట ప్రసాదరావుని రేపల్లె మండలం మొల్లగుంట పీహెచ్‌సీకీ తాత్కాలికంగా బదిలీ చేశారు. వీరివురి మధ్య వారం రోజులుగా పీహెచ్‌లో సఖ్యత లోపించడంతో వాటు ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో వీరిద్దరిని ఇతర ప్రాంతాలకు తాత్కాలికంగా బదిలీ చేశారు. వెంటనే వీరిని విధుల్లో చేరాలని ఆదేశించారు. బదిలీ అదేశాలను ఉల్లంఘిస్తే ఇద్దరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో హెచ్చరించారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన యద్దనపూడి



యద్దనపూడిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బల్లికురవ: ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చి ఎందరో విద్యార్థులను యద్దనపూడి శ్రీనివాసరావు తీర్చిదిద్దారని హెచ్ఎం కె. హనుమంతరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బుధవారంతో ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీనివాసరావును దుశ్శాలువాతో సత్కరించారు. మూడున్నర దశాబ్దాలతో పాటు వృత్తినే దైవంగా భావిస్తూ, సమయపాలన అందరి మన్ననలు అందుకున్నారని చెప్పారు. ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు పొందారని ఉపాధ్యాయులు కొనియాడారు.

పంట కాలువలో బోరు వేశారని ఫిర్యాదు



పంట కాలువలో వేసిన బోరు

బల్లికురవ: పదిమంది రైతుల పంటపొలాలకు నీటి పారుదలకు ఇచ్చే పంట కాలువలో బోరు వేశారని కొప్పరపాడు గ్రామ రైతులు బుధవారం డిప్యూటి తహశీల్దార్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామం నుంచి అద్దంకి వెళ్లే నామ్ రహదారికి పడమర భాగంలో సర్వే నంబర్ 86లో డొంక పంటకాలువ ఉంది. ఈ కాలువలో తన్నీరు దానయ్య ఇటీవల బోరువేసి మోటారు కూడా అమర్చారని బోరుమోటారు ఏర్పాటు చేయటం వల్ల నీరు కిందకు వచ్చే పరిస్థితి లేదని రైతులు చిన వెంకటేశ్వర్లు, బంగారురావు, భూలక్ష్మీ, కోటేశ్వరరావు, ఎం. బాలానాయక్, ఒర్సు కోటయ్య, వీరవాణి, జీ. ఉదయశ్రీ, పరిటాల వీరాంజి తదితరులు ఫిర్యాదు చేశారు.

మినుము, పత్తి రైతులకు ఊరట



పంగులూరులో కురుస్తున్న వర్షం

జే.పంగులూరు: మండల పరిధిలో బుధవారం కురిసిన వర్షానికి మినుము, పత్తి రైతులు ఊరట చెందారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో గత జూలై ఆరంభంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి మినుము, పత్తి పైర్లు వేశారు. ఆ కొద్దిపాటి వర్షానికి వేసిన పైర్లు బాగానే ఉన్నాయి. అప్పటి నుంచి మండలంలోని వర్షాలు సరిగా పడలేదు. ఎండలు తీవ్రంగా కాస్తుండటంతో పత్తి, మినుము మొక్కలు ఎండిపోయే దశకు చెరుకున్నాయి. బుధవారం కురిసిన కొద్ది పాటి వర్షానికి పైర్లకు కొంత మేర ఊరట కలిగిందని రైతులు చెప్పున్నారు. మండలంలోని మినుము 750 హెక్టార్లు, పత్తి 75 హెక్టార్లలో సాగు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

మేదరమెట్ల: పొగాకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈఘటన బుధవారం మేదరమెట్ల పైలాన్ వద్ద చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. వెల్లంపల్లి పొగాకు బోర్డు నుంచి పొగాకు చెక్కుతో ట్రాక్టర్ అద్దంకి మండలం వెంకటాపురం గ్రామానికి బయలుదేరింది. ట్రాక్టర్ మేదరమెట్ల పైలాన్ వద్దకు రాగానే ఆటుగా వస్తున్న ఓలారీ ట్రాక్టర్‌ను ఢీ కొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ శేషారెడ్డికి గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

వామ్మో.. వంతెనలు

- కొమ్మమూరు కాలువపై ప్రయాణమంటే తిప్పలే..

కారంచేడు: మండలంలో వంతెనలు ఎప్పుడు కూలుతాయో తెలియక జనం తల్లడిల్లిపోతున్నారు. కుంకలమర్రు–కారంచేడు రోడ్డులో ప్రయాణం యమ డేంజర్‌గా మారింది. కొమ్మమూరు కాలువ కట్టపై ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణమంటే జనంతో పాటు, రైతులు హడలిపోతున్నారు. గ్రామీణ ప్రాంత రహదారులను సైతం ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతున్నామని గొప్పలు చెప్పుకొనే అధికారులు, పాలకులకు ఏళ్ల కాలంగా తమ సమస్యలు పట్టవా అని కుంకలమర్రు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ రహదారిలో ఉన్న వంతెనలు దాదాపు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇవి ఎప్పుడు ఏ విధంగా ప్రమాదాలకు గురి చేస్తాయోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కారంచేడు–కుంకలమర్రు గ్రామాల మధ్య ఉన్న వంతెనల్లో మూడు వంతెనలు దొంగ తూముల సమీపంలోనే ఉన్నాయి. వీటిలో ఒకటి రొంపేరు కుడి కాలువ, ఒకటి రొంపేరు ఎడమ కాలువ, మరొకటి కుంకలమర్రు సమీపంలోని కొమ్మమూరు కాలువకు ఆనుకొని ఉన్నాయి. ప్రస్తుతం వీటి రెయిలింగ్‌లు కూలిపోయి, వంతెనకు సపోర్ట్‌గా ఉండే దిమ్మలు విరిగిపోయి భయానక స్థితిలో ఉన్నాయి. ఈ వంతెనలపై నుంచే లారీలు, బస్సులు, ఇతర వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో వంతెన వద్ద ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా వాహనాలు కొమ్మమూరు కాలువలోకి దూసుకుపోవడం క్షణాల్లో జరిగిపోతుందని ప్రజలు వాపోతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో అయినా వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాల్సిందే. లేదంటే పెద్ద ఎత్తున ప్రాణ నష్టాలు జరిపోతాయని వారు వాపోతున్నారు. అలాగే కుంకలమర్రు సమీపంలోని వంతెనలు కూడా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు మాత్రం వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని ఎంతో కాలంగా చెబుతూనే ఉన్నారు. అవి ఎప్పుడు మంజూరవుతాయి, ఎప్పుడు పనులు మొదలు పెడతారు, తమ సమస్యలు ఎప్పుడు తీరుస్తారని ప్రజలు వాపోతున్నారు. చీరాల నుంచి కారంచేడు మీదుగా కుంకలమర్రుకు ప్రతి రోజూ షటిల్ సర్వీస్‌గా బస్సు తిరుగుతుంటుంది. ఈ బస్సు డ్రైవర్‌లు సైతం ఈరోడ్డులో అలవాటు ఉన్న వారు మాత్రమే రావాల్సి ఉంటుంది. లేకుంటే ఈ రహదారుల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారుతుందని వాపోతున్నారు.



కారంచేడు దొంగ తూముల సమీపంలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న బస్సు



ప్రమాదకరంగా మారిన కొమ్మమూరు కాలువపై వంతెనలు



దొంగతూముల వంతెనపై రెయిలింగ్ కూలిపోయిన దృశ్యం



కుంకలమర్రు సమీపంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

అభివృద్ధి పనులకు కౌన్సిల్ పచ్చజెండా



అంశాలను ఆమోదిస్తున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి: మున్సిపల్ కౌన్సిల్ అభివృద్ధి పనులకు పచ్చ జెండా ఊపింది. కౌన్సిల్ ఆమోదంతో అంశాలన్నీ ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ ప్రకటించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో అజెండాను సీనియర్ అసిస్టెంట్ అర్జునరావు చదివి వినిపించారు. కమిషనర్‌కు అద్దె ప్రాతిపదికన వాహనం, రూ.5 లక్షలతో చైతన్య కళాశాల నుంచి ఎన్ఎస్పీ కాలువ వరకు గ్రావెల్ రహదారి నిర్మించనున్నారు. ఇదే కళాశాల నుంచి మీనాక్షి రెస్టారెంట్ వరకు గ్రావెల్ రహదారి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చింది. రూ.24.60 లక్షలతో ఆరో వార్డులో సీసీ రహదారి నిర్మాణం, రూ.7.20లక్షలతో గుర్రాల కాలనీలో సీసీ డ్రైన్‌ల నిర్మాణం. 18వ వార్డు కట్టకికందపాలెంలో రూ.6.33 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం, మున్సిపల్ కాంప్లెక్స్‌లో రూమ్ నంబర్ 2, అద్దె పొడిగింపు. పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తూ మరణించిన మస్తాన్ కుమారుడికి కారుణ్య నియామకం. కాంప్లెక్స్‌లో 8వ నంబరు రూమ్‌కు కరెంటు మీటరు ఏర్పాటు. 300 విద్యుత్ స్తంభాల ఏర్పాటు. రూ. 1.85 లక్షలతో 2వ వార్డులోని కాకానిపాలెం మండపం నుంచి నంబూరిపాలెం రోడ్డు వరకు సీసీ డ్రైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రూ.1.65లక్షలతో నంబూరిపాలెంలో సీసీ డ్రైన్, రూ.1.65 లక్షల వ్యయంతో మలాది కిషోర్‌బాబు ఇంటి నుంచి కోండ్రు వీరాంజనేయులు ఇంటి వరకు సీసీ డ్రైన్ నిర్మాణం. 4వ వార్డులో రూ.7 లక్షల వ్యయంతో సీసీ రహదారి, 5వ వార్డులో రూ.10.80 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం. 6,7,9, 12,13.14.17,19,20.1,8 వార్డుల్లో సీసీ డ్రైన్‌ల నిర్మాణం. ఎక్స్‌ప్రెస్ హైవే మెరక కోసం అద్దంకి కొండ నుంచి గ్రావెల్ తోలుకొనుటకు ఎన్‌ఓసీ, 18 వ వార్డులో చిల్లచెట్ల తొలగింపు పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, మేనేజర్ శ్రీదేవి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అజయ్‌బాబు సేవలు అభినందనీయం



అజయ్‌బాబు దంపతులకు మెమొంటో అందజేస్తున్న సహచర ఉపాధ్యాయులు

వేటపాలెం: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గోవాడ అజయ్‌బాబు సేవలు అభినందనీయమని ఎంఈవో సుబ్బయ్య, పురుషోత్తం అభినందించారు. మండల పరిధిలోని కఠారివారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లో ఉపాధ్యాయుడు అజయ్‌బాబు ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు సుబ్బయ్య, పురుషోత్తం పాల్గొని మాట్లాడుతూ అజయ్‌బాబును ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు వారి వృత్తిలో రాణించాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర, జోనల్ స్థాయిలో మూడు ఉత్తమ అవార్డులు సాధించిన అజయ్‌బాబును అభినందించారు. అనంతరం గోవాడ అజయ్‌బాబు, రోహిణి దంపతులను సహా ఉపాధ్యాయులు, ఎంఈఓలు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్ సుబ్బారావు, ఉపాధ్యాయులు కే సుబ్బారావు, భవనం రాణి, జీ సుబ్బారావు, ఎం శీలాదేవి, కే రవీంద్రబాబు, ఎస్‌కే నబీరసూల్, జీ శ్రీనివాసులు, జీ నాగలింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

- పలు అభివృద్ధి పనులకు అమోదం



ప్రజా సమస్యలపై కౌన్సిల్‌లో చర్చిస్తున్న కౌన్సిలర్లు

చీరాల: పట్టణంలో అనేక సమస్యలున్నాయి. పలుమార్లు కౌన్సిల్‌లో చర్చించిన అవి పరిష్కారం కావడం లేదు. కొందరు అధికారుల తీరు కారణంగా మేము ఆరోపణలు ఎదుర్కొంటున్నాం. పట్టణంలో సమస్యలపై దృష్టిపెట్టాలని అధికారులను మున్సిపల్ కౌన్సిలర్లు ప్రశ్నించారు. గురువారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన జీరో ఆవర్‌లో పలువురు తమ ప్రాంత సమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు మాట్లాడుతూ ఊటుకూరువారి వీధి రోడ్డు విస్తరణ గత ఆరేళ్లగా నిలిచిపోయిందన్నారు. 14 మంది గృహయజమానులు సొంతంగా తమ భవనాలను తొలగించుకుంటే ఒక వ్యక్తి మాత్రం తొలగించలేదన్నారు. ఆ భవనానికి ఎటువంటి అనుమతులు లేనప్పటికి తొలగించకుండా మున్సిపల్ అధికారులు తాత్సారం చేయడం ఏంటని నిలదీశాడు. పైపెచ్చు అనుమతులు లేకుండా సెల్‌టవర్లు కూడా ఏర్పాటు చేశాడని ఫిర్యాదు చేశాడు. చైర్మన్ మాట్లాడతూ సెల్ టవర్స్ కనెక్షన్లు తొలగించారని, అలానే భవనం కూడా అవసరమైన మేరకు తొలగించి విస్తరణ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. కౌన్సిలర్ కీర్తి వెంకట్రావ్ మాట్లాడూతూ పట్టణంలో 33 వార్డుల్లో ఇళ్లు నిర్మించుకోవాలంటే కనీసం 30 అడుగులు రోడ్లు ఉంటేనే ప్లానింగ్ ఇవ్వాలనే నిబంధన కారణంగా చాలా మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో చాలా వరకు 10 నుంచి 15 అడుగులు రోడ్లు మాత్రమే ఉన్నాయన్నారు. రెండు సెంట్లలో ఇళ్లు కట్టుకోవాలంటే 10 శాతం స్థలాన్ని మున్సిపాలిటీ రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధనను తొలగించాలన్నారు. బత్తుల అనిల్ మాట్లాడుతూ 31వ వార్డులో 4 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పాపిశెట్టి సురేష్ మాట్లాడుతూ తాగునీటిపై, మించాల సాంబశివరావు మాట్లాడుతూ తన వార్డులో స్కూల్, అపార్ట్‌మెంట్లు, నివాస గృహల మధ్య సెల్‌టవర్ అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని నిర్మాణాన్ని నిలుపుదల చేయాలన్నారు. ఉల్లిపాయల సుబ్బయ్య మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కల బెడద తీవ్రగా ఉందని సమస్యను పరిష్కరించాలని కోరారు. సల్లూరి అనిల్ మాట్లాడుతూ తమవార్డులో ప్రభుత్వ స్థలం అక్రమణకు గురైందన్నారు. వాటిని తొలగించాని కోరారు. అజెండాలోని ఒకటో అంశంపై చాలాసేపు చర్చ జరిగింది. మున్సిపల్ షాపులు అద్దెకు తీసుకుని సంవత్సరాలు తరబడి అద్దె చెల్లించడం లేదన్నారు. పిల్లి జ్యోతి లీజు అంశాన్ని రద్దు చేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొందరు కోర్టును ఆశ్రయించారని బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకరరావులు ఆరోపించారు. మెత్తం అజెండాలోని 67 అంశాలుండగా ఒక అంశాన్ని రద్దు చేయాగా మిగిలిన 66 అంశాలను ఏకగ్రీవంగా అమోదించారు. సమావేశంలో కమిషనర్ కె. రామచంద్రారెడ్డి, డీఈ యేసయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ



రవికుమార్



పార్వతి

యద్దనపూడి/మార్టూరు: యద్దనపూడి మండల తహసీల్దారుగా కాకి రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసి సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన బదిలీల్లో భాగంగా నెల్లూరు వెళ్లారు. తిరిగి తాజాగా జరిగిన బదిలీల్లో భాగంగా మళ్లీ యద్దనపూడికి వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారుకు కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిటీ మస్తాన్ రావు, ఆర్ఐ విష్ణు, వీఆర్వోలు, పాల్గొన్నారు.

మార్టూరు తహసీల్దార్‌గా ప్రశాంతి..

మార్టూరు మండల నూతన తహసీల్దారుగా టీ. ప్రశాంతి నియమితులయ్యారు. జిల్లా అధికారులు ప్రకటించిన జాబితాలో ప్రశాంతిని మార్టూరు తహసీల్దార్‌గా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆమె సంతమాగులూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

కారంచేడు తహసీల్దార్ నియామకం

కారంచేడు: ఎన్నికల విధుల కోసం గుంటూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు పంపుతున్నారు. ఈక్రమంలో బాపట్ల జిల్లా నుంచి గుంటూరు, నెల్లూరు జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు తిరిగి బాపట్లలో జాయిన్ అవ్వడానికి కలెక్టర్ వెంకటమురళీ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో కారంచేడు తహసీల్దారుగా ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న పి. మెహర్‌కుమార్‌ను పీవీపాలెంకు బదిలీ చేశారు. దీంతో ఆయన బుధవారం కారంచేడు నుంచి రిలీవ్ తీసుకున్నారు. భాద్యతలను డీటీ సుశీలకు అప్పగించారు. కె. నరసింహారవు గురువారం బాధ్యతలు తీసుకుంటారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

చీరాల, వేటపాలెం మండలాల తహశీల్దార్లుగా గోపీకృష్ణ, పార్వతిలు

చీరాల: నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల తహశిల్దార్లుగా గోపీకృష్ణ, పార్వతిలు నియమితులయ్యారు. చీరాల మండల తహసీల్దార్‌గా గోపీకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై చీరాల తహశీల్దార్‌గా రానున్నారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. అలానే వేటపాలెం తహశీల్దార్‌గా చీరాలకు చెందిన పార్వతిని నియమించారు. ఆమె బాపట్ల జిల్లాలోని చిన గంజాంతో పాటు ప్రకాశం జిల్లాలో పలు చోట్ల తహశీల్దారుగా పనిచేశారు. ఎన్నికల ముందు పల్నాడు జిల్లాలో పనిచేశారు. అలానే వేటపాలెం తహశీల్దార్‌గా నియమితులైన ఆమె ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు.

భక్తిశ్రద్ధలతో ఫాదర్ హయ్యర్ డే



హయ్యర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రెవరెండ్ దేవదాసు, చర్చి ప్రతినిధులు

చీరాల రూరల్: ఎంతో వ్యయప్రయాసలకోర్చి విదేశాల నుంచి దేశానికి వచ్చి బైబిల్ సువార్తను నలుదిశలా వ్యాప్తిచేసి అనేకమందిని దేవునిలో నడిపించిన ఫాదర్ హయ్యర్ డే వేడుకలను బుధవారం రాత్రి సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా స్థానిక చర్చి పాస్టర్ రెవరెండ్ పిల్లి దేవదాసు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన ఫాదర్ హయ్యర్ విగ్రహానికి రెవరెండ్ పిల్లి దేవదాసు, చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనందబాబు, పీసీసీ, ఎల్‌సీసీ, స్త్రీల సమాజం, యూత్ సభ్యులు పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాస్టర్ ఆండ్రూస్ పాల్గొని మాట్లాడుతూ హయ్యర్ ఆ రోజుల్లో ఎంతో వ్యయప్రయాసలతో విదేశాల నుంచి మన దేశానికి వచ్చి ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘాలను స్థాపించి సువార్త వ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుతం గుంటూరు కేంద్రంగా ఏఈఎల్‌సీ నడుస్తుదని, ఆయన తన సొంత ధనాన్ని వెచ్చించి భూములు కొనుగోలుచేసి చర్చిలు నిర్మించారని చెప్పారు.

ఆ కోవలో నిర్మించినవే మన చీరాల వందేళ్లకు పైగా నిర్మించిన లూథరన్ చర్చి, బాపట్ల, పొన్నూరు, తెనాలి, గుంటూరుతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో లూథరన్ సంఘాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనందబాబు, పీసీసీ, ఎల్‌సీసీ, స్త్రీల సమాజం, యూత్, సంఘస్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చీరాల టౌన్:

వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు గ్రామస్తులకు సూచించారు. బుధవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను పొక్లెయిన్‌తో తొలగించారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తను బుట్టల్లో వేర్వేరుగా నిల్వచేసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి చంద్రమౌళి



చంద్రమౌళిని సత్కరిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: పురావస్తు పరిశోధకుడు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి బహుముఖ ప్రజ్ఞాశాలి అని రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. బుధవారం జ్యోతి చంద్రమౌళి 74వ పుట్టినరోజు వేడుకలను రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పుట్టిన రోజు కేక్ కట్ చేయించి, దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా పురావస్తు శాసన లిపి పరిశోధకుడిగా, సాహితీ వేత్తగా పలు గ్రంథాలు రచించారన్నారు. నేటి తరం వారు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షులు వీరవల్లి రుద్రయ్య, చుండూరి మురళీ సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, చిన్న మురళీకృష్ణ, నర్రా శ్రీలక్ష్మీ, చెన్నుపాటి రామాంజనేయులు, వారణాసి రఘురామశర్మ, అన్నమనేని వెంకటరావు, షేక్ మస్తాన్, బాలు తదితరులు పాల్గొన్నారు.


బైక్ ఢీకొని నాలుగు గొర్రెలు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

మార్టూరు: జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా మరో గొర్రెకు గాయాలయ్యాయి. ఇద్దరు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. హైవే మొబైల్ కానిస్టేబుల్ నాయక్ వివరాల మేరకు.. జే పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన షేక్ బాబావలి తన గొర్రెలను యద్దనపూడి నుంచి మార్టూరు జాతీయ రహదారి మీదుగా గ్రామానికి తోలుకొని వస్తున్నాడు. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో సర్వీసు రోడ్డులో కోనంకి–కోలలపూడి గ్రామాల మధ్య చిలకలూరిపేట నుంచి అద్దంకి వెళ్తున్న బుల్లెట్ బైక్ చీకట్లో గొర్రెల మందను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా ఒక గొర్రెకు కాలు విరిగింది. బైక్ నడుపుతున్న సయ్యద్ అబ్దుల్లా, అతని వెనుక కూర్చున్న షేక్ అబ్దుల్ రెహమాన్ ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డారు. హైవే అంబులెన్స్ సిబ్బంది గాయపడిన ఇద్దరు యువకులను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ ఎస్పీ రాజశేఖర్‌రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులు చిలకలూరిపేట పట్టణంలోని గుర్రాల చావిడికి చెందినవారని తెలుస్తోంది.

ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల: మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేతో కమిషనర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల పట్టణాన్ని స్మార్ట్ పట్టణంగా తీర్చిదిద్దుదామన్నారు. నియోజవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రితో పోరాడి నిధులు తెస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు టెక్స్‌టైల్ పార్కు, ఐటీ బిల్డింగ్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే టూరిజం అభివృద్ధిలో భాగంగా వాడరేవు–రామాపురం రోడ్డును డబుల్ రోడ్డుగా శంకుస్థాపన జరిగిందన్నారు.

యువకుడికి గాయాలు

బల్లికురవ: పనినిమిత్తం బైకుపై వైదన వెళ్లితిరిగి గ్రామానికి వస్తుండగా ఈ మలుపులో అదుపుతప్పి కిందపడి యువకుడు గాయాలపాలయ్యాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం అద్దంకి–బల్లికురవ ఆర్అండ్‌బీ రోడ్డులోని కొమ్మినేనివారిపాలెం క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. అందిన సమాచారం ప్రకారం మార్టూరు మండలం వలపర్ల ఎస్టీ కాలనీకి చెందిన ఆవుల చిన శ్రీను, పనినిమిత్తం వైదన వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది క్షతగాత్రుడిని స్థానికులు వలపర్ల వైద్యశాలకు తరలించారు.